సోమేపల్లి సాహితీ పురస్కారం జాతీయస్థాయి చిన్న కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# మనుష్య ఋణం



**మా** ఉమాపతి మావయ్య అదో తరహా మనిషి. ప్రతీదానికీ అర్థాలూ తాత్పర్యాలూ కావాలంటాడు. తను సుమతీకారుడి ఏకైక శిష్యుడైనట్టుగా ప్రవర్తిస్తాడు.

అందుకే ఇద్దరం సిటీలోనే ఉంటున్నా ఎప్పుడో తప్ప వారింటికి వెళ్ళను. పండగలకీ, పబ్బాలకీ భోజనానికి రమ్మని పిలిచినా ఏదో వంక పెట్టి తప్పించుకుంటాను.

ఎప్పుడైనా వాళ్ళింటికెళ్ళాల్సి వస్తే మావయ్య ఇంట్లో ఉండని సమయాల్లో వెళ్తుంటాను. కానిప్పుడు తనకేదో ఒక మాట చెప్పమంది మా అమ్మ. నగరాన్ని వర్షం అతలాకుతలం చేసేస్తున్నా, మావయ్య ఆఫీసునుంచి వచ్చే టైముకి వెళ్ళక తప్పలేదు.

అత్త, వారి ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి నన్ను చూసి చాలా సంతోషపడ్డారు. ఇంటి విషయాలూ, ఊరి విషయాలూ తిరగేశారు.

"మేనమావ ఇల్లు అయినా ఎప్పుడూ చుట్టపు చూపుగానైనా రావు" నిష్ఠూరంగా అంది అత్త.

"ఇంకా ఉద్యోగంలో పూర్తిగా కుదురుకోలేదుగా అత్తా. ఏవో పనులూ, తిరుగుళ్ళూ ఉంటాయి" అబద్ధమాడాను.

"ఆఫీసు పనంతా నువ్వొక్కడివే మోసేస్తున్నావన్న మాట. అబ్బో చాలా బావుంది అనంత్. ఇవాళ మాత్రం మా ఇంట్లో చెయ్యి కడుక్కోకుండా వెళ్ళనిచ్చేది లేదు"

తలాడిస్తూ వరుసగా నాలుగుసార్లు తుమ్మాను.

"బాగా జలుబు చేసినట్టుంది..." కంగారు పడింది అత్త.

"పొద్దుట వర్షంలో బాగా తడిశాన్లే..."

"జాగ్రత్తగా ఉండాల్రా... నాల్రోజులు వర్షం కురిస్తే చాలు రోడ్లన్నీ కాలువలైపోతాయి. ఇక కార్లు వదలి బోట్లు మీద తిరగాల్సిన కాలం దాపురించింది!" అమృతాంజనం డబ్బా అందిస్తూ అంది.

టీవీలో సిటీని ముంచెత్తుతోన్న వర్ష బీభత్సాన్ని చూపిస్తున్నారు. అది చూస్తూ అత్త పెట్టిన అప్పడాలూ, జంతికలూ నములుతూ కూర్చున్నాం.

ఇంతలో మావయ్య వచ్చాడు "దారి తప్పి వచ్చినట్లున్నావేంట్రా అనంత్"

"అదేం మాటండీ. భారీ వర్షంలో, మూతలుండని మ్యాన్‌హోల్స్ దాటుకుని మరీ వచ్చాడు. ఎంత అభిమానం లేకపోతే వస్తాడు చెప్పండి!"

అత్త మాటలకి ఇబ్బంది పడుతూ చిన్నగా నవ్వి అన్నాను. "మనూరు వెళ్ళొచ్చాను మావయ్యా"

"మీ అమ్మా నాన్నా అంతా బావున్నారా!"

"ఆс. అమ్మకి పసుపుకుంకాల కింద ఇచ్చిన ఎకరం పొలాన్ని అమ్మేస్తారంట. నువ్వు కొంటే బావుంటుందని చెప్పమంది అమ్మ"

"ఇప్పుడా పొలాన్ని అమ్మాల్సిన అవసరం, అగత్యం ఏం వచ్చిందిరా?"

"వరుసగా మూడు పంటలు దెబ్బతిన్నాయి. అప్పులు పేరుకు పోయాయి. ఖర్చులూ పెరిగాయనుకో..."

"నువ్వేమీ ఇంటికి పంపటం లేదా?"

"ఉద్యోగం వచ్చి ఏడాదే కదా అయ్యిందీ. వాయిదా పద్ధతిలో బైకు, టీవీ, బెడ్డూ అవీ కొన్నాను. ఈఎమ్మైలకే సరిపోతోంది జీతమంతా!"

మావయ్యకి బంగారంలాంటి ఛాన్స్ దొరికేసింది. చెలరేగిపోయాడు.

మంచం ఉన్నంతవరకే కాళ్ళు చాపుకోవాలి. అవసరమైన వాటికి అవసరమైన మేరకే ఖర్చు పెట్టాలి. వస్తు వ్యామోహం తగ్గించుకోవాలి– అంటూ అరగంట క్లాసు పీకాడు.

"స్నానం చేసి రండి. అందరికీ భోజనాలు వడ్డిస్తాను"

అత్తమాటలకి 'హమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చుకున్నాను. ఆయనతో ఈవిడెలా వేగుతోందో ఏమిటోనని జాలి పడకుండా ఉండలేకపోయాను.

అందరం డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాం. ఇంటిల్లపాదీ కలిసి లంచ్ చెయ్యడం ఏ కుటుంబంలోనూ కుదరదు, కాని డిన్నర్ కుదురుతుంది. అంతా కలిసి కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తినడం మంచి అలవాటు. ఈ విషయంలో మాత్రం మావయ్యని అభినందించాల్సిందే. నా పెళ్ళయ్యాక నేనూ దీన్ని అమలు చెయ్యాలి.

టేబుల్ మీద హాట్‌ప్యాక్స్ పెట్టి అందరి ముందూ కంచాలు పెట్టింది అత్త.

"టీవీ కట్టెయ్యనా?"

"వద్దు వద్దు..." అరిచాడు బాబీ.

నగరంలో పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజి కాలువలని టీవీల్లో చూపిస్తున్నారు.

"ఇలాంటప్పుడుగాని మనకి చెరువులు, డ్రైనేజీ కాలువల విలువ తెలిసి రాదు" అంటూ మ్యూట్‌లో పెట్టి వచ్చి కూర్చుంది అత్త.

'ఇంక ఆలస్యం దేనికి?' అని చూస్తోంటే మావయ్య అన్నాడు "ప్రార్థన చెయ్యరా. మనమీరోజున ఇలా ఉండటానికి, ఇలా కూర్చుని అన్నం తినడానికి కారకుడైన భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పవూ?"

తడబడ్డాను. పక్కకి చూసినవాడినల్లా ఉలిక్కిపడ్డాను. అంతా కళ్ళు మూసుకుని ప్రార్థన చేస్తున్నారు.

నేనూ కళ్ళు మూసుకుని ఏదో గొణిగాను. ఏదో సినిమాలో వెంకటేష్ పరిస్థితిలా ఉంది నా పని. ఏమని ప్రార్థించావని అడిగితే నీళ్ళు నమలాల్సిందే!

తర్వాత అందరి వంకా తేరపారి చూశాడు మావయ్య. ఏదో

ఉపన్యాసమివ్వబోతున్నాడని అర్థమైంది. కొత్త శ్రోతని దొరికాను గనుక విజృంభించెయ్యడం ఖాయం!

"మనిషి సంఘజీవి. ఎందరో ఎన్నో రకాలుగా మన సుఖజీవనానికి తోడ్పడుతుంటారు. వారందరి ఋణం తీర్చుకోలేనిది. కాని వారు మనకి చేసిన సాయాన్ని ప్రతిరోజూ భోజనం చేసేముందు ఒకసారి గుర్తు చేసుకోవాలి. అది మనిషిగా మన ధర్మం. బాధ్యత!"

"మనమూ చాలామందికి హెల్ప్ చేసి ఉంటాం కదా మావయ్యా. దానికీ దీనికీ చెల్లు" నవ్వాను.

"భగవంతుడు మనకి జ్ఞానేంద్రియాలు ఇచ్చింది ఇతరుల ప్రేమని, మంచిని గుర్తించడానికే. చేతులిచ్చింది సాయం చెయ్యడానికే. మనం చేసిన సాయాన్ని వెంటనే మర్చిపోవాలి. మనకి చేసిన సాయాన్ని మాత్రం కలకాలం గుర్తుపెట్టుకోవాలి. ఆ సమయంలో మనం థాంక్స్ చెప్పినా చెప్పకపోయినా అన్నం తినేముందు మరోసారి తలచుకుని కృతజ్ఞతలు తెలియజేయాలి. అది మన కనీస కర్తవ్యం!"

"వాటి గురించి మనసులో అనుకుంటే సరిపోతుంది కదా మావయ్యా"

"ఊహూఁ. బయటికి చెప్పాలి. నలుగురి ముందు చెబితే వారికీ అవతలి వారి మంచితనం తెలుస్తుంది. స్ఫూర్తి పొందుతారు. మన మనస్సు తేలికవుతుంది. అంచేత ఇవాళ ఎవరికి ఎవరు ఏం సాయం చేశారో చెప్పండి..."

నా గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ఇలాంటిది ఉంటుందని తెలిస్తే ఇలాంటి సమయంలో వచ్చి ఇలా ఇరుక్కుపోయే వాణ్ణి కాదు. ఇప్పుడేం చెయ్యడం? ఏమిటి చెప్పడం? ఇవాళ నాకెవరూ హెల్ప్ చేయలేదు. అలా చెబితే ఈయన ఇంకో లెక్చర్ దంచుతాడు. ఏదో కల్పించి చెప్పేస్తేగాని గండం గట్టెక్కదు!

మావయ్య గొంతు సవరించుకున్నాడు. అందరం చెవులు రిక్కించాం.

"ముందు నేను చెబుతాను. పొద్దుట కాస్త వేగంగానే కారు డ్రైవ్ చేసుకుంటూ ఆఫీసుకి వెళ్తున్నాను. ఇంతలో కాస్త దూరంలో స్కూలు పిల్లలు రోడ్డు దాటుతూ కన్పించారు. సడన్‌గా బ్రేకు మీద కాలు వేసి నొక్కాను. పడలేదు. వాటర్ బాటిల్ దొర్లుకుంటూ బ్రేకు క్రింది కెళ్ళింది. దాన్ని తీసేంత వ్యవధి లేదు. ఎడం వైపున మెట్రోవాళ్ళ పెద్ద గొయ్యి ఉంది. మెదడు బ్లాంక్ అయింది. ఇంకో రెండు క్షణాలైతే వారిని గుద్దేయడం ఖాయం. ఇంతలో కారు పక్కనే బైక్ మీద వెళ్తున్నతను "డివైడర్‌ని గుద్దేయండి" అని అరిచాడు. అసంకల్పితంగా అదే పని చేశాను..."

"కారు బాగా డ్యామేజ్ అయి ఉంటుంది" వెంటనే అన్నాను.

"అయితేనేం ప్రమాదం తప్పింది. ఐ థాంక్ దట్ పెర్సన్" అన్నాడు మావయ్య

చెమ్మగిల్లిన కళ్ళతో.

"మీకేం కాలేదు. అదే పదివేలు. అంత జరిగినా ఇంత దాకా మాకెందుకు చెప్పలేదు?" ఆందోళనపడుతూ అంది అత్త.

"కారు డ్యామేజ్ అయింది గాని ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదుగా!" తేలిక చేస్తూ అన్నాడు మావయ్య.

అంతటి ప్రమాదం తప్పినా అంత నిబ్బరంగా ఎలా ఉండగలుగుతున్నాడో మరి!

"అతడు సమయానికి చక్కని సలహా ఇచ్చి ఆదుకున్న దేవుడు. అతడికి అందరం థాంక్స్ చెబుదాం. మీరు ఇంకెప్పుడూ వాటర్ బాటిల్ కారులో దొర్లేట్టు పెట్టుకోకండి" అత్త అంది.

"ఓకే. నువ్వు చెప్పరా. నీకెవరైనా హెల్ప్ చేశారా?" పెద్దకొడుకు బాబీని అడిగాడు.

"స్కూల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడుతూ పడ్డాను. మోకాలి చిప్పకి దెబ్బ తగిలి రక్తం వచ్చింది. నా ఫ్రెండ్ సుధీర్ తన బ్యాగ్‌లోంచి బాండ్ ఎయిడ్ తెచ్చి అంటించాడు. సుధీర్‌కి థాంక్స్"

"గుడ్. నీహారికా నీ సంగతేంటి?"

"నేనేమో మరేమో హోంవర్కు చెయ్యని రాణికి నా నోట్సు చూపించాను నాన్నా"

"నువ్వు చేసింది కాదు, నీకు చేసిన సాయం గురించి చెప్పమంటున్నాను. బాగా గుర్తు తెచ్చుకో. ఎవరో ఒకరు చేసే ఉంటారు"

కాస్సేపు ఆలోచించి అంది "నేను సైకిల్ మీంచి పడిపోతే రాధిక లేవదీసింది. రాధికకి అప్పుడే థాంక్స్ చెప్పేశాను నాన్నా"

"అయినా సరే, మళ్ళీ చెప్పాలి..."

"నేను బోల్డు బోల్డు సార్లు రాధికకి హెల్ప్ చేశాను..." ఉక్రోషపడింది.

"నీహారికా!"

బుద్ధిమంతురాల్లా చేతులు కట్టుకుని, "రాధికా, నీకు థాంక్స్" అంది.

మావయ్య వాసు వంక చూడగా వాడు ఆలోచనలో పడ్డాడు.

"వాడు గుర్తు తెచ్చుకునే లోపల నేను చెబుతాను" అంది అత్త.

అంతా ఆమె వంక ఆసక్తిగా చూశాం.

"పిల్లలు తింటారని అప్పడాలూ, జంతికలూ వండుతోంటే పక్కింటి పిన్నిగారు వచ్చి సాయపడ్డారు. ఆవిడ సాయపడకపోయి వుంటే ఆ పని అంత త్వరగా తెమిలేది

కాదు. సరస్వతి పిన్నిగారికి థాంక్స్”

“గుడ్” తప్పట్లు కొట్టాడు మావయ్య.

“ఇవాళేం జరిగిందంటే గోపి స్కూల్లో నా డెస్కు మీద కూర్చున్నాడు. లేవమంటే లేవలేదు. వాడి మెడ గట్టిగా పట్టుకుని గుంజాను. వాడు నన్ను తన్నాడు. నేను కొట్టాను. వాడు ఏడుస్తూ ప్రిన్సిపాల్ మేడమ్‌కి చెబుతానని వెళ్ళాడు. అప్పుడేమో రఘురామ్ వచ్చి వాడ్ని ఆపాడు. ఇంకెప్పుడూ అలా కొట్టవద్దని నన్ను మందలించి, మా ఇద్దరి చేతులూ కలిపాడు. గోపీ నేనూ మళ్ళీ ఫ్రెండ్స్ అయిపోయాం. రఘురామ్‌కి థాంక్సు” అన్నాడు వాసు.

ఇక మిగిలింది నేనే. అంతా నా వంక తిరిగారు. వాళ్ళంతా ఎంతో నిజాయితీగా చెప్పారు. కల్పించి చెప్పడానికి నాకు సిగ్గేసింది. గబగబా ఆలోచించాను. ఉదయం లేచింది మొదలు ఇక్కడి కొచ్చేదాకా జరిగినవన్నీ మళ్ళీ మళ్ళీ నెమరేసుకున్నాను. ఊహుఁ, ఒక్కరూ నాకు హెల్ప్ చేయలేదు. కాని నేనే ఒకతను కారుతో సహా నీటిలో మునిగిపోకుండా కాపాడాను!

నాలో ఉత్సాహం ఉరకలేసింది.

“ఇవాళేం జరిగిందో తెలుసా మావయ్యా. ఒక కారు వర్షపు నీటిలోంచి వెళ్తూ వెళ్తూ ఓ గోతిలో పడి ఆగిపోయింది. నీళ్ళేమో మొలలోతు పైనే ఉన్నాయి. ఇంకా ఇంకా వర్షపు నీరు ఎక్కడెక్కడ్నుంచో వచ్చి చేరుతూనే ఉంది. కారు అంతకంతకీ నీటిలో మునిగిపోతోంది. కారులో ఉన్నతను గగ్గోలు పెడుతోంటే ఆఫీసుకి వెళ్తోన్న వాణ్ణల్లా ఆగిపోయాను. బట్టలు పాడవుతాయని తెలుసు. అయినా అతన్ని రక్షించాలని గభాల్న వెళ్ళాను. కారుని తోశాను. ఎలాగైతేనేం జలగండం నుంచి అతడు బయటపడ్డాడు...!” ఫోజు కొట్టాను.

“నువ్వు చేసింది మామూలు సాయం కాదు. ఎవరెలా పోతే మనకేం అనుకోకుండా ముందుకెళ్ళావు. నిండు ప్రాణాన్ని రక్షించావు. నీరు కారులోకెళ్ళి వుంటే చాలా ప్రమాదమయ్యేది. గ్రేట్. అంతా అనంత్‌కి బిగ్‌హ్యాండ్ ఇవ్వండి...”

అంతా తప్పట్లు కొట్టారు.

“అనంత్‌ని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది” అంది అత్త అభినందన పూర్వకంగా నా వంక చూస్తూ.

“మరైతే నీకివాళ ఎవరూ చిన్నపాటి ఉపకారం చేయలేదా?”

పెదవి విరుస్తూ తల అడ్డంగా ఊపాను.

“అడిగో అనంత్ బావ...” బాబీ అరిచాడు టీవీ చూపిస్తూ.

అందరం అటు చూశాం. ఎవరో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన దృశ్యాన్ని టీవీలో

మళ్ళీ మళ్ళీ చూపిస్తున్నారు. నీటిలో ఆగిపోయిన కారుని కొందరు తోస్తున్నారు గాని కదలటం లేదు. గబగబా నేను వెళ్ళి కారుని తోస్తూ తోస్తూ మ్యాన్‌హోల్‌లో పడి మునిగిపోయాను!

నా గుండెలు గుభిల్లుమన్నాయి.

"మై గాడ్! ఆ ప్రమాదం నుంచి ఎలా బయట పడ్డావురా?" ఆందోళన పడ్డాడు మావయ్య.

"కాళ్ళకి ఇనుప చట్రం తగిలింది. దాన్ని గట్టిగా తన్ని నా అంతట నేను బయటపడ్డాను..." అని చెబుతూ ఆగాను. గొంతుక్కేదో అడ్డం పడగా తలొంచుకుని తిరిగి అన్నాను "అప్పుడో ఇద్దరు నా రెక్కలు పట్టుకొని పైకి లాగారు..."

ఆ సంగతి మరచినందుకు, దాచినందుకు గిల్టీగా ఫీలవుతూ చెప్పాను.

మావయ్య లేచొచ్చి నా తల నిమిరాడు.

"నువ్వు లేచిన వేళ మంచిదయింది. సమయానికి వాళ్ళు దేవుళ్ళా వచ్చి నిన్ను రక్షించారు. నీకేమైనా అయితే మీ అమ్మా నాన్నా...! మొత్తం మీ కుటుంబాన్నే రక్షించిన ఆ మహానుభావులకి చెయ్యెత్తి నమస్కరించు. ఇప్పుడే కాదు అన్నం ముద్ద నోట్లో పెట్టుకునే ప్రతిసారీ నీకీ బతుకిచ్చిన తల్లిదండ్రుల్నీ, దాన్ని నిలబెట్టిన ఆ అజ్ఞాత వ్యక్తుల్నీ గుర్తు చేసుకుంటూనే ఉండు. అయినా వారి రుణం తీరదు! అంత గొప్ప ఉ పకారం అది!"

నా కళ్ళు వారి యడల కృతజ్ఞతతో అశ్రుపూరితాలయ్యాయి.

* * *

**(రమ్యభారతి-ఏప్రిల్ 2017)**